
కథ

# కాలుష్యం



జొత్తార్

పంటకాలువ గట్టుమీద ఎదురైన రెడ్డిబాబు 'ఏరా, సత్యం.... పెళ్లి చేసుకొన్నావటగా, ఎలా వుంది కాపురం?' తెల్లని గుబురు మీసాన్ని దువ్వుకుంటూ పలుకరింపుగా అన్నాడు.

సత్యంలో సిగ్గు బుగ్గయి పగిలింది.

'కట్నం ఏ మాత్రం లాగావేంటి?'

సత్యం సత్తెకాలపు మనిషిలా చిరునవ్వు చిందించి, చిన్నగా చెప్పాడు.

'ఆ!.... అదేంట్రా! కట్నం లేకుండా పెళ్లేమిట్రా?... నాకు చెపితే అథమం ఐదు లక్షల సంబంధం చూసేవాణ్ణిగా!...'

సత్యానికి రెడ్డిబాబు ధోరణి ఇబ్బందిగా తోచింది. అయినా ఊరికి పెద్దవాడు, మాట జారితే వెనక్కి తీసుకోవడం కుదరదని, రెండు చేతులెత్తి నమస్కరిస్తూ, తప్పుకొని తలొంచుక తన దారిన తాను పోయాడు.

తనంత తానుగా సత్యం తప్పుకొని వెళ్లడం రెడ్డిబాబుకు నచ్చలేదు. తననో వెర్రి వెంగళప్పగా జమకట్టి, తన ఉనికిని ఊపేసి మరీ పోతున్నట్టుగా మనసు చివుక్కుమంది.

ఆయన మనసు చివుక్కుమంటే గుండె గాండ్రుమంటుందని అందరికీ తెలుసు.

రెడ్డిబాబు పోతున్న సత్యాన్ని చూస్తూ తలాడించాడు. ఆ ఆడింపు ఆ ఊళ్లో మున్ముందు జరగబోయే ఒక అనర్థానికి గుర్తు!

సత్యానికి ఆ ఊళ్లో మంచి పేరుంది. చదువుతోపాటు సంస్కారమూ, పనిపాటలతో పాటు కుటుంబ బాధ్యతలూ అలవర్చుకున్న అతన్ని చూపుతూ తలిదండ్రులు తమ పిల్లల్ని గదమాయిస్తారు. చాలా స్పష్టమైన, నిజాయితీ నిండిన పద్ధతులతో జీవితాన్ని క్రమపర్చుకున్న సత్యం రెడ్డిబాబుతో పాటు ఆ ఊరి వారందరికీ ఆత్మీయుడే!

మంచికి ఉదాహరణగా మసులుకొనే అతనికి తమ కూతుళ్ల నివ్వాలని చాలామంది ఆశపడ్డారు. కట్నం రేటు పెంచుతూ చాలా సంబంధాలొచ్చాయి. వాటిని చాలా మర్యాదగా, మనసు నొప్పించని రీతిలో కాదన్న అతనిపై చాటుచాటుగా పుకార్లు కూడా పుట్టుకొచ్చాయి.

అయితే అవి పుకార్లే తప్ప నిజాలు కావని అందరికీ లోలో తెలుసు. ఈ లోలోతనం నలుగురిలో ఉన్నప్పుడు రంగులీనుతూ ఎదుటివాళ్లను వెర్రివాళ్లను చేస్తుంది. వాతావరణ కాలుష్యాన్నయినా భరించొచ్చు కాని, ఈ మనో కాలుష్యాన్ని భరించడం సగటు మనిషికి సాధ్యం కాదు.

మరో మూడు నెలలు గడిచాయో, లేదో...

ఓనాడు రచ్చబండ దగ్గర రెడ్డిబాబు తన అనుచరుల మధ్య నారదావతారమెత్తి. 'సత్తెం సత్తెకాలపు మనిషిలా పెళ్లి చేసుకున్నందుకు కాదు. కట్నం తీసుకోనందుకూ కాదు. కట్నం నేరమే అనుకున్నాడో, మరేమనుకున్నాడో మన కనవసరం. ఈ పిల్లోనికీ, ఆ పిల్లదానికీ పెళ్లికి ముందేమైనా తతంగం నడిచి ఉండొచ్చు. నడవకా ఉండొచ్చు. అదీ మన

కనవసరం.' నెమ్మదిగా అన్నాడు.

ఆ అనవసరాల్ని యింత అవసరంగా రెడ్డిబాబు ఎందుకు చెబుతున్నాడో అతని అంతరంగం తెలిసిన అనుచరులు గ్రహించారు. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

తన ఎత్తుగడ ఏనుగెక్కుతున్నందుకు లోలో అదోలా నవ్వుకొని, పైకి అమాయక స్వరంతో...

'ఇహ సత్యం తండ్రి వెంకట్రావు వెనకాముందు ఆలోచించక ఆ సంబంధాన్ని అంగీకరించడంలో మతలబు ఏదైనా... ఆహాఁ... ఉంటుందని కాదు. ఉండక పోనూ వచ్చు. అదీ మన కనవసరం.' అన్నాడు.

వెంకట్రావు గురించి తెలిసిన అనుచరులందరూ తెల్లబోయారు. తలగోక్కున్నారు. రెడ్డిబాబు వెంకట్రావు ఊసెత్తడం ఎవరికీ నచ్చలేదు. ఎవరేం చెప్పినా వింటూ, తలూపడమే తప్ప అతను ఏనాడూ, ఎవరి విషయంలోనూ నోరిప్పినవాడు కాదు. ఆ కుటుంబ వ్యవహారాలన్నీ అతని భార్య జానికమ్మ కనుసన్నలలో జరిగిపోతాయని ఆ ఊళ్లో తెలియని వాళ్లెవరూ లేరు.

'వెంకట్రావు ఊసెత్తకండి. మీరన్నట్టు 'మతలబు' అంటూ ఏదన్నా ఉంటే, అది అత్తాకోడళ్ల మధ్యే వుండొచ్చు.' అన్నాడో అమాంబాపతు అనుచరుడు.

'అగ్గదీ సంగతి... భలే పట్టేశావురా...' అంటూ రెడ్డిబాబు గుబురు మీసాల మాటున గుంభనవు నవ్వును దాచుకుంటూ, అమాంబాపతు అనుచరుని వీపున ఒకటంటించాడు.

మిగతా అనుచరులంతా ఆ అమాంబాపతుగాన్ని గొప్పగా, అసూయగా చూశారు.

తాను పట్టేసిన 'మతలబు' ఏమిటో తనకే తెలీక, ఆ అమాంబాపతు నెత్తి గోక్కున్నాడు. జుట్టు పీక్కున్నాడు. పైకి మాత్రం పళ్లికిలించాడు.

'చెప్పరా.... అత్తా కోడళ్ల మతలబు ఏంటి?... ఏమా కత?'

రెడ్డిబాబు వారందరినీ గదమాయింపు చూపుతో నిలిపి, 'ఏమిటి, ఏమయింది? అంటూ రాగాలు తీయడం మన కనవసరం. వెనకటికెవరో అన్నట్లు, వ్యక్తుల ప్రయివేటు బతుకు వారి వారి సొంతం'. ఎవడి పెళ్లాం వాడిష్టం. ఎవరి కోడలు ఏమైపోయినా మన మెడల్లో దండలేం పడవు. కాకపోతే... ఇదో ఊరూ, ఇచటో పద్ధతీ, పాడూ ఉంటాయి గనుక...' అదోలా అనేసి, తలాడించాడు. రెడ్డిబాబు తలాడించాడంటే ఆ ఊళ్లో మున్ముందు...

'ఏమయిందేమయిందే....'

'మీ మొహం, ఏమయితే మనకెందుకు? తన అనుచరుల వెర్రితనం మీద ఉమ్మేసినట్టుగా అని, 'థూ... థూ....' అంటూ చేతులు దులిపేసుకుంటూ లేచి, అమాంబాపతుగానితో సహా వెళ్లిపోయాడు.

నిజానికి వెంకట్రావు కుటుంబంలో మతలబు అంటూ ఏదీ లేదు. ఆ ఇంటికోడలైన సీత వికసించిన వ్యక్తిత్వం ఆమె స్థిరాస్తి. తన మంచితనంతో ఆ ఇంటిని పుచ్చపువ్వులా మార్చేసింది. పచ్చని తోరణంలా నిలబెట్టింది. ఆ ఇంటి కూతురై...! జానికమ్మ జగాన్ని జయించినంత ఆనందంలో... వెంకట్రావు అంతకు మించిన అనుభూతిలో... ఆ యిల్లు పచ్చ పచ్చగా శ్వాసిస్తూంది.

ఆ కుటుంబం కోడలి రాకతో నైనా రోకలి పాటకెక్కదా... అనే ఆశలో శ్వాసించే కొందరి ఆలోచనలకు భిన్నంగా ఒక్కసారైనా ఆ కుటుంబం రచ్చకెక్కక పోవడం, కనీసం గుసగుసలైనా వినవడకపోవడం కొందరికి మహా ఇబ్బందిగా వుంది.

ఆ కోడల్ని చెప్పుకొని తమ కోడళ్లను దెప్పిపొడిచేవారు కొందరైతే, ఆ కొడుకును తలుచుకొని తమ కొడుకుల్ని తిట్టిపోసేవారు మరికొందరైతే, ఆ తల్లిదండ్రుల్ని చూసి తమ తల్లిదండ్రుల్ని యీసడించుకునేవారు ఇంకొందరైతే, ఆ అత్తామామల్ని చూసి తమ అత్తామామల్ని అసహ్యించుకునేవారు మరెందరో... వెరసి ఆ ఊళ్లో ఎక్కువమందికి ఆ కుటుంబం కంటగింపుగా ఉంది. కడుపుబ్బరంగా ఉంది.

కడుపుబ్బరం కాలుష్యం లాటిది. వ్యాపించడం దాని లక్షణం.

బావుల దగ్గరా, పని విడుపుల్లో, కీనీడల్లో, ఇద్దరాడవాళ్ల నాలికల్లో...

'ఇది విన్నావు వదినా... మరీ...! అయినా మనకెందుకులే..'

'ఔనట! సంసారంలో నిప్పులు చిమ్ముకోడమంటే యిదే... అయినా...'

'ఇంకా నయం... ఆ సత్యానికి నన్నిద్దామనుకొన్నారట... బతికి పోయా... అమ్మ బాబో... తల్లీ కొడుకు కలిసి... అయినా...'

'నువ్ చూసినవా?'

'ఆఁ! ... పదిపూట్ల మిరపకాయ పండినింట్లో ఏం చేస్తారో పనిగట్టుకొని చూడాలేమిటి?... అయినా మన...'

వెంకట్రావు కోడలొచ్చిన వేళా విశేషమో, నలుగురిలో కలిసేందుకు తహతహ లాడుతున్నాడు. పైసా కట్నం తీసుకోనందుకు ఊరంతా తన నభినందిస్తున్నారనే అభిప్రాయం అతన్ని ఇంట్లో నిలువనీయడం లేదు. ఎవరినోట ఏ పొగడ్త వుందో వినేందుకు రచ్చబండకేసి కదిలిన చల్లని వేళలో...

ఏం, వెంకట్రావ్... ఊరి మీద పడ్డావు. కోడలు యింట్లో ఉండనివ్వడం లేదా?...' చిన్నప్పటినుంచీ మాటా, మంచికీ ఒకటిగా ఉన్నతను, చుట్టరికానికి దగ్గరివాడు నవ్వుతూ అన్నాడు.


ఒక విధంగా అది సరసపు పలుకరింపులా అనిపించినా, సరసమేగానీ, విరసమే గానీ... తన కోడలి ఊసావిధంగా ఎత్తడం వెంకట్రావుకు నచ్చలేదు. 'నాకేం ఖర్మరా!... దేవతలాంటి నా కోడలు.... నిజం చెప్పేదా?... ఆ పిల్ల నా కూతురురా' అన్నాడు ఆవేశంగా...

'ఆఁ... విన్పిస్తుందిలే బాగోతం.'

తెల్లబోతూ వెంకట్రావు 'ఏంట్రా... ఏంట్రా నువ్వనేది?'

'నేను కాదురా... ఊరు, ఊరంతా...'

'ఛత్. ఊరే కాదు... దేశమంతా కలిసి కూసినా అబద్ధం నిజం కాదురా...' మాట తేలగొడుతూ, బింకంగా అన్నాడు వెంకట్రావు.



## చెల్లెలి కోసం...

*ఇది పాత తెలుగు సినిమా పేరు కాదండోయ్, బాలీవుడ్ సంగతి! నిన్నటి ప్రముఖ క్రికెట్ హీరో పటౌడీ నవాబ్ మన్సూర్ అలీ ఖాన్‌హాలీవుడ్ నటి శర్మిలాటాగోర్‌ల సుపుత్రుడు సయీఫ్ అలీ ఖాన్ క్రికెటర్ కాకుండా నటుడయ్యాడు. తన చెల్లెలు సోహా నటి కావటానికి ఎంత మాత్రమూ అంగీకరించలేదట. ఇప్పుడు తల్లి శర్మిల పూనుకుంటే పాపం, సరేనన్నాట్ట. మొన్నీ మధ్యే సోహా ఒక ఆడ్ ఫిల్మ్‌లో చేసేందుకు వెళితే, సయీఫ్ కూడా వెళ్లాడు. అంతే కాదు, సోహాను ప్రమోట్ చేసేందుకు వివిధప్రయత్నాలు ప్రారంభించాడు కూడానూ!*

ఎన్.

'తెల్సులేవోయ్... అయినా అదేదో సామెత చెప్పినట్టు...'

'హే ... భగవాన్... రేయ్, నా కోడల్ని అనుకోకండిరా... మా ఇంటి దీపాన్ని చిదిమెయ్యకండిరా..' ఊరంతా వినపడేలా గొంతుచించుక అరవాలన్నంత ఆవేశం... 'రేయ్, మా బతుకులు మమ్మల్ని బతకనీయండిరా... మా ఊసెత్తకండిరా...' ఆవేశాన్ని అదుపు చేసుకుంటూ గద్గద స్వరంతో అన్నాడు వెంకట్రావు.

'అలా చెప్పకపోతే కోడలు తిండిపెట్టనన్నదా?' నవ్వాడతను.

'అయ్యో రామా... వీడికేమైనా పిచ్చిపట్టిందా? అయినవాడే యింత చులకనగా అంటుంటే... యిహ ఊరు...!?' వెంకట్రావులో చింపిరి ఆలోచనలు.

***

పేగు తెంచుక పుట్టిన బిడ్డలా కోడల్ని చూసుకునే జానికమ్మతో 'మరీ అంత చులకనగాకే తల్లీ... అలా చూసుకునే మా బతుకులిలా తలకొరివి పెట్టేవాడైనా లేకుండా తగలడ్డాయ్... అవునూ, నీ కొడుకింకా నీ మాటే వింటున్నాడా? ఆహ్... మాట వరసకి... తల్లీ అల్లం, పెళ్లాం బెల్లం అంటారుగా అందుకని.' తోటి అమ్మలక్కలు నోళ్లు నొక్కుంటూ, నొసటితో వెక్కిరిస్తూ.



జానికమ్మ విస్తుబోయింది. 'చల్లని కాపురాల్లో చిచ్చుపెట్టడం తప్ప వీళ్లకి మరో ఆలోచనుండదా? యింకా ఏమేమి ఆడిపోసుకుంటున్నారో... ఛీ ... ఛీ... అయినా అసలిలా ఆడిపోసుకోవడానికి కారణం?' లో లో తుంపర తుంపర ఆలోచనలు...

***

చిన్న చిన్న నీటి తుంపరలే నీటి బుడగలౌతాయి. బుడగలు బుడగలగానే నిలిచిపోవు. పెరిగి, పగలకా మానవు.

రోజులు గడిచేకొలది వెంకట్రావుకు గానీ, జానికమ్మకుగానీ నిద్రకరువైపోతూంది. అన్నం సహించడం లేదు. ఇంట్లో కాలు నిలవడం లేదు. తమ నెవరో తరిమేస్తున్నట్టుగా, పొలం పనులో, మరొకటో కల్పించుకొని ముఖం చాటుచేసుకొంటున్నారు. ముభావంగా ఉంటున్నారు. ఊరంతా వెక్కిరిస్తున్నట్టుగా ఏవేవో ఆలోచనలు ... ఆవేశకావేశాలు... ప్రతీకారాపేక్ష నెమ్మదిగా పురుడు పోసుకుంటూంది.

ఆ రాత్రి భోజనాల దగ్గర 'సీత వడ్డిస్తూందిలే... నువ్వు మాతోపాటు తినమ్మా...' వడ్డించబోయే తల్లిని వారిస్తూ అన్నాడు సత్యం.

జానికమ్మ గుండెలు గుభేల్ మన్నాయి. పాతికేళ్లుగా తన చేతి వంటతో, వడ్డనతో ఎదిగిన కొడుకేనా వద్దని వారిస్తున్నది? చివరకు నా చేతి వడ్డనే చేదయిందా కొడకా? లోలోనే కుమిలి కుమిలిపోతూ, 'ఇవాళ యిదయింది. రేపు మరొకటి... నిజమే, ఊరు ఊరికనే అనుకోదు కదా! నిప్పు లేనిదే పొగ ఎలా వస్తుంది?...' జానికమ్మలో ఆలోచనలు సాగేకొలదీ మనసు పరిపరి విధాల వంకలు తిరుగుతూ, వ్యతిరేకాత్మక ధోరణిలో కోడలు చేసే ప్రతిపనిలో దోషం... ప్రతిమాటలో కొక్కెరింపు... ప్రతి చూపులో వెక్కిరింత... జానికమ్మ తట్టుకోలేకపోతూంది. కోడలిపై క్రోధాగ్ని కుబుసం విడవసాగింది.

'ఛీ... ఛీ... నంగనాచీ, దరిద్రపు ముం.. నమ్మినందుకు నా కొంపే ముంచావు గదే...కోతి ముండా... యిహ కాసుకో, నా తడాఖా రుచి చూపిస్తా..' లోలోనే నిర్ధారణ కొచ్చింది జానికమ్మ.

వెంకట్రావు ఆలోచనలూ తద్భిన్నంగా లేవు. కూతురిలా భావించి, దీవించిన కోడలే తమనిలా నలుగురి నోళ్లలో పడేసినందుకు విరక్తితో, ఈసడింపుతో...' మంచోడికి మనసిరిగితే ఏమౌతుందో చేసి చూపిస్తా... లోకంలో ఎంతమంది కోడళ్లు చావలేదు. 'లోలోనే కసికసిగా పళ్లు కొరుక్కున్నాడు.

### *సోయా, టీలతో క్యాన్సర్ దూరం!*

*టీ తాగటం వల్ల చాలా రోగాలు తగ్గుతాయని పరిశీలకులన్నారు. ఇటీవలి పరిశోధనల్లో తేలిన కొత్త సంగతి, టీని, సోయాబీన్స్‌తో కలిపి తీసుకోవటం వల్ల, మహిళల్లో వక్షోజాల క్యాన్సర్, పురుషుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్‌ల ప్రమాదం చాలా వరకు తగ్గుతుందని. టీ, సోయాబీన్స్ రెండూ కూడా క్యాన్సర్ వ్యాధితో పోరాడేందుకు తగిన శక్తి గలవి అంటున్నారు హార్వర్డ్ యూనివర్సిటీ విజ్ఞానవేత్తలు.*

*ఎన్*

ఆ కసిలో, క్రోదాగ్నిలో సీతచేసే ప్రతి పనిలో, పలుకరింపులో వారిద్దరికీ వ్యతిరేకార్థాలూ, అపార్థాలూ తప్ప ఆప్యాయత కనిపించలేదు. అనురాగం పొడసూపలేదు. కోడల్ని కడతేర్చి కొడుక్కి మరోపెళ్లి చేయాల్సిందేనని నిర్ధారణ కొచ్చారు.

అందుకోసం, అనువైన సమయం, సందర్భం కోసం పథకాలు వేయసాగారు.

తల్లిదండ్రుల్లో వచ్చిన ఈ మార్పును సత్యం పసిగట్టలేదు. పసిగట్టడానికి సీతలో ఏదేనీ లోపం కనిపిస్తే కదా?...

అయితే సీత అత్తమామల వైఖరిలో మార్పును గమనించింది. వారిలో ఏదో అంతర్మథనం జరుగుతున్నట్టూ, తనకు వ్యతిరకంగా వారి ఆలోచనా సరళి సాగుతున్నట్టూ వారి మాట విరుపును బట్టి, చూపు వంకరను బట్టి పసిగట్టింది. అయితే అందుకు కారణమేమై వుంటుందో ఆమె ఆలోచనకందలేదు. తన ప్రవర్తనలో, ఆలోచనల్లో ఏ తప్పూ కనిపించలేదు. తన అత్తామామలు తమ నపార్థం చేసుకోవడం తట్టుకోలేకపోయింది.

అపార్థం కాలుష్యం లాంటిది. మనం ముక్కు మూసుకున్నంతలో కాలుష్యం పోదు. మనిషే దానికి దూరంగా పోవాలి. అలా పోలేని పరిస్థితుల్లో కాలుష్యానికి కారణమేదో తెలుసుకోవాలి. విరుగుడేదో తెలిసి ఉపయోగించాలి. లేదా... ఆ కాలుష్యం ఆ ఆవరణాన్ని వీలయినంత మేర చుట్టేసి, మనిషిని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. ఊపిరాడకుండా చేసి చంపేస్తుంది.

సీతకు తన అత్తామామల మనస్తత్వానికి బాధపడినా, అలిగి పుట్టింటికి పోవడమో, విడాకులు తీసుకోవడమో, కుటుంబాన్ని చీల్చి వేరు కుంపటి పెట్టడమో, 'వసుంధర' వగైరాలకు తన సమస్య చెప్పుకొని సలహా కోరడమో, అత్తామామల చేతుల్లో చిత్రహింసల పాలై కాలి చావడమో పరిష్కారంగా భావించలేదు.

మహా మహా జాతుల సమస్యలూ, దేశదేశాల భయంకర యుద్ధ మేఘాలూ చర్చల ద్వారా పరిష్కారం దిశలో పయనిస్తున్నప్పుడు ఒక చిన్న కుటుంబ సమస్యకు చర్చల ద్వారా పరిష్కారం లభించకపోతుందా? అని తనని తానే ప్రశ్నించుకుంది.

ఆ మరునాడే సీత భర్తనూ, అత్తమామల్నీ కూచోబెట్టి కుండబ్రద్దలు కొట్టింది. మనసులో మర్మాలున్నంతకాలం మనిషికి సుఖం దూరమవుతుందనీ, అరమరికలు లేని చర్చలతో అంతరంగాల కంటిన మలినాన్ని కడిగేసుకు బతకడంలోనే నిజజీవితం దాగుందని, నచ్చజెప్పి ఒప్పించగలిగింది.

ఆమెలోని లక్ష్యశుద్ధితో ఆ ఇంటికి ముసిరిన కాలుష్యం కకావికలైపోయింది. ■